క్లుప్తంగా

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

ఆమనగల్లు: స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 25న ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీగార్డెన్‌లో బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కేకే.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షకు ముఖ్య అతిథులుగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్‌లు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల పరిధి పార్టీ శ్రేణులు రావాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పాష కుటుంబీకులను పరామర్శిస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు పీఆర్‌ఓ పాష సతీమణి షాహిన్ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు గురువారం క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి పట్టణంలోని పాష నివాసంలో బాధిత కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్, అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న సీఐ

యాచారం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు హెచ్చరించారు. పీఎస్ పరిధి నక్కర్తమేడిపల్లి గ్రామంలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం, పాఠశాల, కమ్యూనిటీ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. చట్టవిరుద్ధంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తప్పవన్నారు. ఘర్షణలకు పాల్పడటం, చోరీలు చేయడం, గంజాయి సేవించడం వంటి చట్టవిరుద్ధ పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు తేజంరెడ్డి, వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

మహా పిరమిడ్‌కు తరలిన ధ్యానులు



శక్తిస్థల్ వద్ద ధ్యానులు

ఇబ్రహీంపట్నం: కడ్తాల్ సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో గురువారం నిర్వహించిన పత్రీజీ స్మృతి స్మరణోత్సవాలకు ఇబ్రహీంపట్నం ధ్యానులు తరలివెళ్లారు. పత్రీజీ చూపిన బాటలో పయనిస్తూ నిత్యం ధ్యానం చేసుకునే ధ్యానులు అక్కడి శక్తి స్థల్‌లో జరిగిన ఉత్సవాలకు హాజరై, ఆధ్యాత్మిక గురువుల సందేశాలను, బోధనలను శ్రద్ధతో విన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మేనేజర్ ప్రవీణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఇబ్రహీంపట్నం మున్సిపల్ కన్వీనర్ ఎల్లేష్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డికి కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి, ప్రమాద బీమా తదితర సౌకర్యాలను కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, వారంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం శనివారం సీడీఎంఏ ఆఫీసు వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యాదయ్య, రాజు, వెంకటేశ్, సమంత, స్వప్న, వినోద్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

మో‘డల్’ మార్కెట్



అసంపూర్తి పనులతో నిలిచిన మోడల్ మార్కెట్ నిర్మాణం

ఆదిబట్ల ఆదర్శ మార్కెట్ నిర్మాణం అటకెక్కింది. రూ. కోట్లు వెచ్చించి మూడేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. తొలినాళ్లలో చకచకా సాగినప్పటికీ.. ఆ తరువాత పడకేశాయి. దీంతో వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ ప్రజలకు ఇప్పట్లో అందుబాటులోకి వచ్చేలా కనిపించడం లేదు.


- ఏడాదిన్నరగా నిలిచిన నిర్మాణ పనులు
- మూడేళ్లుగా ముందుకు సాగని వైనం
- ఎదురు చూస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం, పాలకవర్గం

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్ఎస్ హయాంలో ప్రతి మున్సిపాలిటీకి ఒక మోడల్ మార్కెట్ ఉండాలనే ఉద్దేశంతో ఆదిబట్లకు దుకాణ సముదాయాన్ని మూడేళ్ల క్రితం మంజూరు చేశారు. మున్సిపాలిటీ హెడ్‌క్వార్టర్‌కు కొద్ది దూరంలో ప్రభుత్వ స్థలం కేటాయించారు. పబ్లిక్ హెల్త్ నిధులు రూ.2.5 కోట్లతో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఆరునెలల్లో పిల్లర్లు, స్లాబ్‌ల వరకు పూర్తి చేశారు. మూడు వైపులా షెడ్లు, మధ్యలో కాళీ ప్రదేశం ఉండేలా డిజైన్ చేశారు. ఇక్కడే మటన్, చికెన్, ఫిష్‌తో పాటు కూరగాయలు, పండ్లు, పూల క్రయవిక్రయాలకు వీలుగా దుకాణ సముదాయం నిర్మించాలి. కానీ ఇప్పటి వరకు భవన నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది. పనులు ప్రారంభించిన ఏడాది లోపు పూర్తి చేసి, ప్రభుత్వానికి అప్పగించాలి. కానీ ఇక్కడ ఎక్కడ వేసిన గొంగడి అక్కడేనన్న చందంగా పనులు నిలిచిపోయాయి. దీనికి కారణం నిర్మాణ దారుడికి డబ్బులు చెల్లించకపోవడమేనని తెలుస్తోంది.

మూడేళ్లుగా మురిపిస్తూ..

విపణి నిర్మాణ పనులు ప్రారంభించి మూడేళ్లు అయింది. పనులు నిలిచిపోయి యేడాదిన్నర గడించింది. ఈ మార్కెట్ అందుబాటులోకి వస్తే ఆదిబట్ల నగరంలో మాంసం, కూరగాయల వ్యాపారులకు మడిగ దొరకనుంది. మార్కెట్ పూర్తి కాక పోవడంతో రోడ్ల వెంట సంతలు పెట్టి గ్రామీణ ప్రాంతాలను తలపించేలా చేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తా చేదారం వేస్తున్నారు. మాంసం వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకొని నిర్వహిస్తున్నారు. ఇలా చేయడం వలన మాంసాహారాలు, ఇతర ఆహార పదార్థాలను దుమ్ముధూళి ఆవహించనుందని, తద్వారా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అత్యాధునికంగా సకల సౌకర్యాలతో చేపట్టిన మార్కెట్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించి, వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్‌తో అభివృద్ధి



మోడల్ మార్కెట్ నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. విపణి వినియోగంలోకి వస్తే ఆదిబట్ల మరింత అభివృద్ధి చెందుతుంది. పలువురికి ఉపాధి లభిస్తుంది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అందుబాటులోకి వచ్చే విధంగా కృషి చేస్తా.

– ఈసీ శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్, ఆదిబట్ల

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి



అత్యాధునిక హంగులతో చేపట్టిన మోడల్ మార్కెట్ పనులు మధ్యలో ఆగిపోయాయి. ఇదే విషయమై పలు మార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాము. ప్రభుత్వ నిర్ణయం, ఆదేశాల మేరకు మార్కెట్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించేందుకు కృషి చేస్తా. త్వరగా వినియోగంలోకి వచ్చేలా చూస్తా.

–బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదిబట్ల

రుణమాఫీపై ఆంక్షలు తగవు

- అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలి
- కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్

ఇబ్రహీంపట్నం రూరల్: రుణమాఫీపై ఆంక్షలు తగవని, అర్హులందరికీ.. రూ.2 లక్షలు మాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో పరిపాలన అధికారి సునిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అర్హుల్లో చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. రైతు భరోసా సక్రమంగా అందలేదని చెప్పారు. కూలీలకు రూ.12 వేలు ఇస్తామని ఇవ్వలేదని ఆరోపించారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించాలని, సబ్సిడీపై రైతులకు వ్యవసాయ యాంత్రిక పరికరాలను అందజేయాలని కోరారు. పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రతాప్, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీపతి, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాపయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందజేయాలి



డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌ను సన్మానిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

కడ్తాల్: పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పాల ఉత్పత్తి దారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని, ప్రోత్సాహక నగదును పాల బిల్లుతో పాటే రైతుల ఖాతాల్లో జమ చేయాలని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, గ్రాసం, దాణా అందజేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం రైతులతో కలిసి డిప్యూటీ డైరెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంసీసీ మేనేజర్ ప్రాణేశ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు రామకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ వీరయ్య, నాయకులు నర్సింహ, గంప శ్రీను, రాములు, వెంకట్ రాములుగౌడ్, మహేశ్, రంగయ్య, జంగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



డీటీ సంతోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


ఆమనగల్లు: విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి రాములయ్య ఆరోపించారు. వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్, అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల కోరారు. రిటైర్డ్ టీచర్ల పెన్షనరీ బెనిఫిట్స్‌ను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు విష్ణుమూర్తి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు పాండునాయక్ పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి

బడంగ్‌పేట్: మున్సిపాలిటీకి ఆనుకొని ఉన్న శ్రీమారుతీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేణు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కాలనీవాసులు ఆయనతో కలిసి కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీమారుతీనగర్ రోడ్ నంబర్ 1, 2లో డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా ఉందని తెలిపారు. డ్రైనేజీ కాల్వల పనులు పూర్తి చేయించాలని కోరారు. కాలనీలో విద్యుత్ లైట్లు లేక చీకట్లో అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. చిన్నారులు, విశ్రాంతులు చీకట్లో నడవలేకపోతున్నారన్నారు. ఖాళీ ప్లాట్లల్లో పిచ్చిమొక్కలు పెరిగి పాములు నివాసం ఉంటున్నాయని బయటకు వెళ్లాలంటే కాలనీవాసులు బయపడుతున్నారన్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని వీధికుక్కలను పట్టుకుపోవాలని విన్నవించారు. అదేవిధంగా సీసీ రోడ్లు లేక గతుకుల, అంతర్గత మట్టి రోడ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కార్పొరేషన్‌కు ఆనుకొని ఉన్న మా కాలనీపై దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, సాయికుమార్, కార్యనిర్వాహక అధ్యక్షులు కృష్ణమోహన్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రమేష్, ప్రదీప్‌కుమార్ సాయిజ్యోతి, చంద్రశేఖర్ లస్కర్‌నాయక్, రాజేందర్, కిరణ్, సాయిలాల్, విజయ్, సైదారావు, సాయికృష్ణవేణు, నర్సింగరావు తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

కడ్తాల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్థానిక ఎన్నికల కార్యశాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల అన్ని స్థానాల్లో పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించి, పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీరయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, కడ్తాల్ మండల ఎన్నికల ఇన్‌చార్జి బక్కికుమార్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్ నాయక్, నాయకులు, మాన్యనాయక్, రవీందర్ రెడ్డి, భగీరథ్, శ్రీశైలంగౌడ్, వెంకటేశ్, విక్రమ్‌చారి, వెంకటేశ్, బల్వంత్‌రెడ్డి, కుమార్, సాయిప్రభు, కరుణాకర్, రాజు, శ్రీను ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు విస్మరించిన ప్రభుత్వం



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న కమిటీ నాయకులు

మంచాల: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి డాక్టర్ జగన్నాథం డిమాండ్ చేశారు. గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.డీ.అర్షద్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారం చేపట్టాక వాటిని విస్మరించిందని ఆరోపించారు. ఇచ్చిన మాటను నిలుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ మండల అధ్యక్షుడు డాక్టర్ అజ్మత్ ఖాన్, ప్రధాన కార్యదర్శి తుల్జారామ్, ఉపాధ్యక్షుడు యాదయ్య, నర్సింహ పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

కేశంపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్ వైఫై సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల ఆర్థికసాయంతో, బైర్కాన్‌పల్లి, లేమామిడి, తొమ్మిదిరేకుల, కొత్తపేట గ్రామాల్లో నాయకులు, దాతల ఆర్థికసాయంతో సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేయించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- నేటి నుంచి రేషన్ కార్డుల పంపిణీ
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల అందజేత తదితర అంశాలపై మన్నెగూడ బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు అన్ని మండలాల్లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు.. స్థానికంగా ఉండే వారిని సమన్వయం చేసుకుంటూ అర్హులకు రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్డు రాలేదని ఎవరూ ఫిర్యాదు చేయకుండా చూసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని, గ్రౌండింగ్ పూర్తియిన ఇళ్లను ప్రారంభించని వారిని వదిలేసి, ఆసక్తి ఉన్న కొత్త వారికి కేటాయించాలని సూచించారు.

రాయితీపై సిలిండర్ దక్కేలా చూడాలి

తెల్ల రేషన్ కార్డు లేదనే సాకుతో 200 యూనిట్ల ఉచిత కరెంటుకు అర్హత దక్కని వారికి కొత్తగా కార్డులు ఇస్తున్నాం. కాబట్టి, కరెంటు బిల్లులు కట్టాలని వారిని వేధించరాదని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్యాస్ సబ్సిడీ రావడం లేదని అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, పౌరసరఫరాల శాఖ అధికారులు.. అర్హులకు రాయితీపై సిలిండర్ దక్కేలా చూడాలని చెప్పారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలమని, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పనిచేయని వారిపై చర్యలు తీసుకుంటూనే.. పనిచేసే అధికారులకు తగిన గుర్తింపు ఇస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, ఆర్డీఓ అనంత్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, విద్యుత్ శాఖ డీఈ పాండు రంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు కె.అమరేందర్ రెడ్డి, బి.సత్యనారాయణ రెడ్డి, బాలకృష్ణ, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం



సుదర్శన యాగంలో ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఘనంగా శ్రీలక్ష్మీ సుదర్శన నారసింహ యాగం

ఆమనగల్లు: దైవ కార్యక్రమాలు సమాజశాంతికి దోహదపడతాయని, ఆయా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామం శ్రీ వేదాద్రి గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో గురువారం శ్రీలక్ష్మీ సుదర్శన నారసింహ యాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు నర్సింహమూర్తి, శ్రీనివాసమూర్తి, వేద పండితులు మురళీధర్ శర్మల ఆధ్వర్యంలో నృసింహుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాటగీత, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ నిర్వాహకుడు శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

- ఆధునిక వ్యవసాయంపై దృష్టి పెట్టాలి
- పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్ రాజేందర్‌రెడ్డి

యాచారం: ఆధునిక వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని, తద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తుందని పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి అన్నారు. పంటల సాగు, ఎరువుల వాడకంపై గురువారం యాచారం పీఏసీఎస్ కార్యాలయంలో నాబార్డు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్ల అందజేతపై నాబార్డు విరివిగా నిధులు ఇవ్వాలని సూచించారు. కొందరు అన్నదాతలు ఇప్పటికీ.. పాత విధానంలో సాగు చేస్తూ.. అధిక మొత్తంలో ఎరువులు వాడుతూ నష్టపోతున్నారని తెలిపారు. అలా కాకుండా వారికి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సాగు విషయంలో ఎప్పటికప్పుడు తగిన సలహాలు, సూచనలు చేస్తే ఆధునిక పద్ధతులపై దృష్టి సారించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులకు పీఏసీఎస్ నుంచి కావాల్సిన పంట రుణాలు, ఎరువులు, విత్తనాలను అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీ కృష్ణ, నాబార్డు అధికారి హర్షత్, పీఏసీఎస్ సీఈఓ నాగరాజు, పీఏసీఎస్ డైరెక్టర్లు మల్లారెడ్డి, లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం

షాద్‌నగర్‌రూరల్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని కుమ్మరి సంఘం డివిజన్ అధ్యక్షుడు నడికూడ శ్రీశైలం అన్నారు. కుమ్మరి నారాయణ, కుమ్మరి రాములు(రిటైర్డ్ ఎస్‌టీఓ) జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీశైలం, జ్ఞానేశ్వర్ గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అని, ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడంతో ఎంతో పుణ్యఫలం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పధాన్ని అలవర్చుకొని సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతినెల అమావాస్య రోజు అన్నదాన కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, రమేష్, కృష్ణ, సాయిలు, రమేష్ పాల్గొన్నారు.



ఆమనగల్లు: మొక్కలు నాటుతున్న ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం ఆ పార్టీ శ్రేణులు ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా బాణసంచా కాలుస్తూ సంబురాలు చేసుకున్నారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు. – సాక్షి, నెట్‌వర్క్



తలకొండపల్లి: కేకు కట్‌చేస్తున్న మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్ తదితరులు



కడ్తాల్: కేక్ కట్ చేస్తున్న గులాబీ శ్రేణులు



మాడ్గుల: నాగిళ్ల గ్రామంలో..